సాక్షి ప్రకాశం
మంగళవారం । 2 । జనవరి । 2024



ప్రజలు సంతోషంగా జీవించాలి

నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలంతా సంతోషంగా జీవించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆకాంక్షించారు. ఘనంగా వేడుకలు నిర్వహించారు. - 8లో..



మత్స్యకారులకు జీవనోపాధి

మత్స్యకారుల జీవనోపాధులు మెరుగుపరచడానికి ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తానని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

పొగ మంచు కురుస్తుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాజకీయాల్లో స్థాన చలనం సహజం

● మంత్రి ఆదిమూలపు సురేష్



యర్రగొండపాలెం: రాజకీయాల్లో స్థాన చలనం సహజంగా ఉంటుందని, ఎన్టీఆర్ కాలం నుంచి అటువంటి పరిస్థితి ఉన్న విషయాన్ని టీడీపీ నాయకులు మర్చిపోయి మాట్లాడుతున్నారని రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక రాజీవ్ అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన మాట్లాడారు. లోకేష్ ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి నియోజకవర్గం పేరు కూడా పలకడం చేతకాకుండా మంగళగిరి నుంచి పోటీ చేసిన విషయం మర్చిపోయి.. అధికారం కోసం నోటికొచ్చినట్లు టీడీపీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఒకేసారి అధికారంలోకి రాలేదని, ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలపై పోరాడిందని గుర్తు చేశారు. అధికార దాహం తీరని చంద్రబాబు తన హయాంలో 23 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనుగోలు చేశాడని, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఆయనకు 23 మంది ఎమ్మెల్యేలను ఇచ్చి దిమ్మతిరిగే తీర్పు చెప్పారని అన్నారు. దత్తపుత్రుడిని అడ్డంపెట్టుకుని చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ అధికారం తమదేనని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. అసలు పవన్ కల్యాణ్ ఎక్కడి నుంచి పోటీచేస్తాడో ఆయనకే అర్థంకాని పరిస్థితి ఉందన్నారు. ఆయన పార్టీ పెట్టింది టీడీపీ కోసమేనన్నారు. జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి సురేష్ స్పష్టం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌డీఏ పీడీ



పీడీ వసుంధర

ఒంగోలు టౌన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), వైఎస్సార్ కేపీ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా టి.వసుంధర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు డ్వామా కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిణిగా పనిచేస్తూ డీఆర్‌డీఏ పీడీగా జిల్లాకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి పీడీగా పనిచేసిన మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ నుంచి వసుంధర బాధ్యతలు స్వీకరించారు.

జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్‌గా రాజీవ్



రాజీవ్ పాలడుగు

ఒంగోలు: జగనన్న సచివాలయాల కన్వీనర్లు, గృహ సారధులు (జేసీఎస్) జిల్లా కో ఆర్డినేటర్‌గా రాజీవ్ పాలడుగును నియమించినట్లు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. రాజీవ్ నాగులుప్పపాడు మండలం మద్దిరాలపాడు వాసి. అమెరికాతో పాటు మన దేశంలోనూ వ్యాపారం చేస్తున్నారు. నాటా సభ్యునిగా కూడా ఉన్నారు. తనకు అత్యంత బాధ్యతాయుతమైన హోదా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి రాజీవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

17 ఆరోగ్యమిత్ర ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

ఒంగోలు టౌన్: జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 17 ఆరోగ్యమిత్ర ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యమిత్రతో పాటు రెండు టీం లీడర్ ఉద్యోగాలను కూడా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి దరఖాస్తు నమూనా, నివాస ధ్రువీకరణ నమూనా పత్రాలను ప్రభుత్వ జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా స్వయంగాగానీ, రిజిస్టర్ పోస్ట్ ద్వారాగానీ అందజేయాలని తెలిపారు. జిల్లా సమన్వయకర్త, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్యాలయం, పాత రిమ్స్ ఆస్పత్రి, ఒంగోలు చిరునామాకు పంపించాలన్నారు. పూర్తి దరఖాస్తుతో పాటుగా ధ్రువీకరణ పత్రాల నకలును జతపరచాలని, గడువు తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తులు స్వీకరించేది లేదని స్పష్టం చేశారు.



రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఒంగోలులోని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



హైదరాబాద్‌లో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, తదితరులు



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి దివ్యాంగ విద్యార్థులకు తినిపిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



ఆదివారం రాత్రి ఒంగోలు వీధుల్లో బైక్‌లపై కేరింతలు కొడుతున్న యువకులు

● కొత్తకొత్తగా..

కొత్త సంవత్సరానికి జిల్లావాసులు సరికొత్తగా స్వాగతం పలికారు. 2024 ఏడాదికి గ్రాండ్ వెల్‌కమ్ చెబుతూ వేడుకలు చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే సంబరాలు ప్రారంభించారు. సోమవారమంతా కోలాహలంగా కొనసాగించారు. ప్రముఖుల నివాసాలు, కార్యాలయాలన్నీ కిక్కిరిసాయి. కేక్ కటింగ్‌లతో తియ్యని వేడుకలు జరిగాయి. ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు, అలంకరణలతో భక్తిభావం వెల్లివిరిసింది.

– సాక్షి, ఒంగోలు

మరోసారి వైద్య విప్లవం

● నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలు
● 6 నెలల పాటు జిల్లా వ్యాప్తంగా 660 మెడికల్ క్యాంపులు
● ప్రతి క్యాంపులో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు



ఒంగోలు టౌన్: జిల్లాలో మరోసారి వైద్య విప్లవం మొదలవనుంది. నేటి నుంచి ఆరు నెలల పాటు జిల్లావ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత వైద్య శిబిరాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గల 538 సచివాలయాలు, పట్టణాల్లోని 122 సచివాలయాల పరిధిలో వీటిని నిర్వహించనున్నారు. జనవరిలో 172 క్యాంపులు, ఫిబ్రవరిలో 168, మార్చిలో 151, ఏప్రిల్‌లో 97, మే నెలలో 49, జూన్‌లో 23 వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. మొత్తం మీద 660 క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించనున్నారు. వారంలో మంగళ, శుక్రవారం గ్రామీణ ప్రాంతాల్లో, బుధవారం పట్టణ ప్రాంతంలో వైద్య శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. ఒక్కొక్క వైద్య శిబిరంలో ముగ్గురు వైద్యులు ఉంటారు. వారిలో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు ఉంటారు. అందులో తప్పనిసరిగా ఒక లేడీ డాక్టర్ అందుబాటులో ఉంటారు. మిగిలిన ఇద్దరిలో ఒక గైనకాలజిస్టు వైద్యురాలుగానీ, ఆర్థోపెడిక్ వైద్యులుగానీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే, ప్రతి క్యాంపులో ఒక ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఉండాలని ఆదేశించారు. వారితో పాటు పారామెడికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది కూడా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఈ కార్యక్రమం కోసం ఇప్పటికే 110 మంది స్పెషలిస్టులు, 125 మంది మెడికల్ ఆఫీసర్లు, 20 మంది ఆప్తాల్మిక్ అసిస్టెంట్లను సిద్ధం చేశారు. మొదటి విడత ఆరోగ్య శిబిరంలో ఇచ్చిన మందులకు అదనంగా మరిన్ని ఔషధాలను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. రిఫరల్ కేసుల పెంపు కోసం పలు సలహాలు, సూచనలు జారీ చేశారు. రిఫరల్ కేసులకు సంబంధించి మెరుగైన వైద్య సేవల కోసం వచ్చే వారికి రూ.500 ఇవ్వనున్నారు. జనవరిలో ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జూన్ నెలతో ముగుస్తాయని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తొలి విడతలో 2.70 లక్షల మందికి వైద్యం...

గతేడాది సెప్టెంబర్ 31 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు 35 రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష తొలి విడత వైద్య శిబిరాల్లో జిల్లాలో 2.70 లక్షల మందికి వైద్య సేవలు అందించారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లో కలుపుకుని మొత్తం 660 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. స్పెషలిస్టు వైద్యులు పాల్గొని పరీక్షలు చేశారు. అవసరమైనవారికి షుగర్, కొలెస్ట్రాల్, హిమోగ్లోబిన్, యూరిన్ అనాలసిస్, కిడ్నీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, ఈసీజీ, తదితర రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్షల ఆధారంగా 4,788 మందికి మెరుగైన చికిత్స అవసరమని నిర్ధారించి ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వైఎస్సార్ కంటి వెలుగు కింద కూడా కంటి పరీక్షలు నిర్వహించారు. 25 వేల మందికి కళ్లద్దాలు అందజేశారు. సాధారణ సమస్యలకు ఉచితంగా మందులుఅందజేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు



విజేతలకు మెమెంటోలు అందిస్తున్న కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు

చీమకుర్తి: పేర్నమిట్టలో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి 42వ షూటింగ్ బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. బాలికల విభాగంలో గుంటూరు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. బాలుర విభాగంలో బాపట్ల, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. విజేతలకు స్థానిక కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు చేతుల మీదుగా మెమెంటోలు అందించి అభినందించారు.

కడుపుకోత మిగిల్చి..



బోరుమంటున్న పవన్ కుటుంబ సభ్యులు



విలపిస్తున్న రాహుల్ కుటుంబ సభ్యులు

● రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు దుర్మరణం
● నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని..
● టీ తాగేందుకు వెళ్తూ అనంతలోకాలకు
● పేద కుటుంబాల్లో తీరని విషాదం
● పాపాయిపల్లెలో విషాదం



పూర్తిగా దగ్ధమైన మోటార్ సైకిల్



మంటల్లో కాలిపోయిన బొలేరో లగేజీ ట్రక్కు

బేస్తవారిపేట: నూతన సంవత్సరం వేళ పేదింట పెను విషాదం అలముకుంది. అందరితో కలిసి నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్న వారు కొద్దిసేపటిలోనే విగతజీవులుగా మారడం అందర్నీ కలచివేసింది. బేస్తవారిపేట మండలంలోని చెట్టిచర్ల సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవేపై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాలకు కడుపుకోతను మిగిల్చింది. చేతికందివచ్చిన వారు విగతజీవులుగా మారడంతో కన్నవారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అర్ధరాత్రి వరకూ...

బేస్తవారిపేట మండలంలోని పాపాయిపల్లెకు చెందిన నల్లబోతుల పవన్‌కళ్యాణ్ (19), పిక్కిలి రాహుల్ (19), గుజ్జుల శ్రీనివాసులు (20) ముగ్గురూ స్నేహితులు. గుజ్జుల శ్రీనివాస్ అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకుంటూ సున్నిపెంటలో ఆయుర్వేద దుకాణం నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల కింద స్వగ్రామం పాపాయిపల్లె వచ్చాడు. నూతన సంవత్సర వేడుకల్లో పాలుపంచుకునేందుకు స్నేహితులు ముగ్గురూ రాత్రి 11.30 గంటల సమయంలో ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. స్నేహితులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందంగా గడిపారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో టీ తాగేందుకు సమీపంలోని టోల్ ప్లాజా వద్దకు వెళ్దామనుకున్నారు. ముందుగా రెండు బైకుల్లో వెళ్లాలనుకున్నారు. అయితే, ఒక బైక్‌లో పెట్రోల్ లేకపోవడంతో ముగ్గురూ ఒకే బైక్‌పై బయలుదేరారు. ఒంగోలు-నంద్యాల హైవేపై చెట్టిచర్ల బస్టాండ్ సమీపంలోకి రాగానే గిద్దలూరు నుంచి కంభం వైపు వెళ్తున్న బొలేరో వాహనం (లగేజీ ట్రక్కు) యువకుల బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులూ దుర్మరణం చెందారు. బైక్ ఆయిల్ ట్యాంకు ఒక్కసారిగా పేలిపోవడంతో నల్లబోతు పవన్‌కళ్యాణ్‌పై పెట్రోల్ పడి మంటలు అంటుకుని కాలిపోయి మృతిచెందాడు.

ఒక్కొక్కరిది ఒక్కో విషాదం...





శ్రీనివాసులు, రాహుల్ (ఫైల్)

నూతన సంవత్సర వేడుకలు చేసుకుని ఇంటికి వస్తారని ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు వీరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న పిడుగులాంటి వార్త తెలిసి కుప్పకూలిపోయారు. చేతికందివచ్చిన వారు ఇలా మృత్యువాతపడటంతో రోదిస్తున్న వారిని ఆపడం ఎవరితరం కాలేదు. నూతన సంవత్సరం వేల గ్రామం మొత్తం ఒక్కసారిగా విషాదం అలముకుంది. పిక్కిలి రాహుల్ గ్రామంలో ఉంటూ ఓ ప్రైవేట్ కళాశాలలో వెటర్నరీ డిప్లమో కోర్సు చదువుతున్నాడు. తండ్రి మహేశ్వరుడు ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడి మరణంతో తల్లి రాజేశ్వరి, కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. గుజ్జుల వెంకటరత్నం, ఆనందలక్ష్మి దంపతులు మేకలు పెంచుకుంటూ జీవిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు శ్రీనివాసులు. సున్నిపెంట నుంచి రెండు రోజుల ముందు గ్రామానికి వచ్చి ఇలా మృత్యువాత పడటంతో కన్నీరుమున్నీరవుతున్నారు. కూలి పనులు చేసుకునే నల్లబోతుల పిచ్చయ్య, లక్ష్మీదేవి దంపతుల మూడో కుమారుడు పవన్‌కళ్యాణ్ ఈ సంఘటనలో అగ్నికి ఆహుతయ్యాడు. అతని కుటుంబ సభ్యులు విలవిల్లాడిపోయారు. పవన్ కంభంలో ఇంటర్ చదుతున్నాడు.

భయానకంగా ప్రమాదస్థలి...

రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతమంతా భయానకంగా మారింది. బొలేరో, ద్విచక్రవాహం ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురూ చెల్లాచెదురుగా పడిపోయారు. బైక్ ట్యాంకు నుంచి మంటలు చెలరేగడంతో బైక్ మొత్తం దగ్ధమైంది. బొలేరో వాహనానికి కూడా మంటలు అంటుకుని పాక్షికంగా దగ్ధమైంది. మృతదేహాలు చెల్లాచెదురుగా పడడం, మంటలు చెలరేగడంతో చెట్టిచర్ల బస్టాండ్ సమీప ప్రాంతమంతా భయానకంగా మారింది.





ఒంగోలులోని కలెక్టర్ బంగ్లాలో లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పింఛన్ పండుగ

● రూ.3 వేలకు పెరిగిన పింఛన్
● కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా అందజేత



రూ.3 వేల వైఎస్సార్ పెన్షన్ కానుక పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పీడీలు

ఒంగోలు అర్బన్: నవరత్నాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పెన్షన్ కానుక నగదు మరోసారి పెరిగింది. పింఛన్ లబ్ధిదారుల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగోసారి పింఛన్ నగదును 250 రూపాయలు పెంచారు. దీంతో ఇప్పటి వరకూ రూ.2,750 అందుకున్న లబ్ధిదారులు ఈ నెల నుంచి రూ.3000 అందుకుంటున్నారు. పెరిగిన పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్ అందజేశారు. డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో కలిసి వైఎస్సార్ పెన్షన్ కానుక కింద పెరిగిన నగదుకు సంబంధించిన పోస్టర్‌ను కూడా కలెక్టర్ ఆవిష్కరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసేవారు. కొత్త పింఛన్ల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. జన్మభూమి కమిటీల ఆమోదం పేరుతో పచ్చచొక్కాలు వేసుకునే వారికే కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా వరుసగా నాలుగోసారి రూ.250 పెంచి రూ.3 వేలు పింఛన్ అందిస్తుండటంతో లబ్ధిదారులు ఆనందం పట్టలేకపోతున్నారు. ఎవరైనా అనారోగ్యంతో ఆస్పత్రిలో, లేక వేరే ప్రాంతాల్లో ఉన్నప్పటికీ వలంటీర్లు అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వలంటీర్లు పింఛన్లు అందజేస్తున్నారు. కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన పెరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఊరూరా పింఛన్ పెంపు ఉత్సవాలు

● డీఆర్‌డీఏ పీడీ వసుంధర

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లను రూ.2,750 నుంచి రూ.3000కు పెంచిన నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పింఛన్ పెంపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ టి.వసుంధర తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2020 నుంచి 2023 వరకు విడతల వారీగా పింఛన్లు పెంచుతూ రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఇస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో స్థానిక శాసన సభ్యులు నిర్ణయించిన తేదీల్లో పింఛన్ల పెంపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ఉత్సవాలు నిర్వహించే తేదీ నుంచి పెంచిన పింఛన్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఎప్పటిలాగే ఈ పింఛన్లను ఇంటి వద్దకే తెచ్చి ఇస్తారన్నారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

చెరువులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- వాహనం కింద ఇరుక్కుపోయి రైతు మృతి
- ముండ్లమూరు మండలం బసవాపురంలో విషాదం



కొట్నాల వీరయ్య మృతదేహం

ముండ్లమూరు: ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లడంతో ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాద సంఘటన ముండ్లమూరు మండలంలోని బసవాపురం చెరువు వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొట్నాల వీరయ్య(48) తన పొలంలో నువ్వులు చల్లేందుకు సోమవారం ఉదయం గోళ్లపాటి వెంకటేశ్వర్లుతో కలిసి వెళ్తున్నారు. మార్గమధ్యంలో చెరువు కట్టపై అడ్డుగా వచ్చిన ముళ్ల చెట్టు కొమ్మను తప్పించుకునే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి నీటిలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. వీరయ్య ట్రాక్టర్ కింద ఇరుక్కుపోగా వెంకటేశ్వర్లు పక్కన పడిపోయాడు. వీరయ్యను రక్షించేందుకు ప్రయత్నించినా వీలుకాకపోవడంతో కేకలు వేసి చుట్టుపక్కల రైతులను పిలిచాడు. గ్రామస్తులు వచ్చి వీరయ్యను బయటకు లాగారు. అప్పటికే వీరయ్య మృతి చెందాడు. మృతుని భార్య వెంకటలక్ష్మమ్మ, కుమారుడు అప్పారావు, కుమార్తె రమణ బోరున విలపించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై యూవీ కృష్ణయ్య పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు



కనిగిరిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



మంత్రి సురేష్‌కు శుభాకాంక్షలు చెబుతున్న మేయర్ గంగాడ సుజాత

హ్యాపీ న్యూ ఇయర్

నూతన సంవత్సర వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకుల నివాసాలు, క్యాంపు కార్యాలయాలు, కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ మాగుంట, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌కు ప్రముఖులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

- సాక్షి నెట్‌వర్క్



తన నివాసం వద్ద నిర్వహించిన వేడుకల్లో సరదాగా చిందేస్తున్న ఎంపీ మాగుంట



నాయకుల సమక్షంలో కేక్ కట్‌చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు శుభాకాంక్షలు చెబుతున్న జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, సిబ్బంది



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఏపీ ఎన్‌జీఓ సంఘ నాయకుల శుభాకాంక్షలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ మాగుంట



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, వైద్యశాఖ అధికారులు



న్యూయర్ వేడుకలో కుటుంబ సభ్యులు, బంగ్లా వ్యక్తిగత సిబ్బందితో కలెక్టర్ దినేష్‌కుమార్ దంపతులు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న రవాణా శాఖ అధికారులు



ఏపీఆర్ఎస్ఏ నాయకుల శుభాకాంక్షలు

దారి తప్పిన జింక పిల్ల

- సపర్యలు చేసి అడవిలో వదిలిన అటవీ సిబ్బంది



జింక పిల్లను అడవిలో వదిలేందుకు వెళ్తున్న సిబ్బంది

పెద్దదోర్నాల: జింకల గుంపు నుంచి దారి తప్పిన ఓ జింక పిల్ల రోడ్డు దాటలేక ఇబ్బంది పడుతుండగా అటవీశాఖ సిబ్బంది పట్టుకుని సపర్యలు చేశారు. అనంతరం అటవీప్రాంతంలో సురక్షితంగా వదిలి పెట్టారు. ఈ సంఘటన గణపతి చెక్‌పోస్ట్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. జింక పిల్ల వయసు రోజుల్లో ఉంటుందని అటవీశాఖ సిబ్బంది మహేశ్వరరెడ్డి, గురుస్వామి తెలిపారు.

ప్రజలు సంతోషంగా జీవించాలి

- నూతన సంవత్సర వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల ఆకాంక్ష
- మంత్రి సురేష్, ఎంపీ మాగుంట, కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ప్రముఖుల శుభాకాంక్షలు

ఒంగోలు సబర్బన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ.. నూతన ఆంగ్ల సంవత్సరంలో జిల్లాలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి సురేష్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఒనుడా చైర్మన్ శింగరాజు మీనాకుమారి వెంకట్రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా క్షేమమే మాగుంట కుటుంబ ఆశయం

ఒంగోలు: ప్రజా క్షేమమే మాగుంట కుటుంబ ఆశయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఒంగోలులోని మాగుంట క్యాంప్ కార్యాలయంలో అభిమానులు నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ.. గత ఏడాదిలో మంచి చెడులను బేరీజు వేసుకుంటూ నూతన సంవత్సరంలో మరింత మంచి చేకూరేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తనతోపాటు దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి, వదిన పార్వతమ్మతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి విడదీయరాని అనుబంధం ఉందని పేర్కొంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, ఆయన ఆకాంక్షను ప్రతి ఇంటికీ తెలియజేసేలా కృషి చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, ఒనుడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, మాజీ ఎమ్మెల్యేలు కసుకుర్తి ఆదెన్న, బూచేపల్లి శివప్రసాద రెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, దివి శివరాం, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీ కృష్ణ, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, పేస్ విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఎ.రమణారెడ్డి, గొర్రెపాటి శ్రీనివాసరావు, ఒంగోలు ఎంపీపీ పల్లప్రోలు మల్లికార్జునరెడ్డి, జిల్లా అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎన్‌జీవో సంఘం నేతలు, పోలీసు అధికారులు పాల్గొని ఎంపీ మాగుంటకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని ఆత్మకూరు బ్రహ్మయ్య, కుప్పా రంగసాయి, బెల్లం సత్యన్నారాయణ, ఓగిరాల రామకృష్ణ, తాతా ప్రసాద్, పలువురు కార్పొరేటర్లు పర్యవేక్షించారు.

కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో..

ఒంగోలు అర్బన్: కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, సతీమణి విజయకృష్ణన్‌కు జిల్లా అధికారులు, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ల డైరీలు, క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒనుడా శింగరాజు మీనాకుమారి, మేయర్ గంగాడ సుజాత కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జేసీ కె.శ్రీనివాసులు, డీఆర్‌ఓ ఆర్ శ్రీలత, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరెడ్డి, సర్వే శాఖ ఏడీ కిషోర్‌బాబు, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, వికలాంగుల శాఖ ఏడీ అర్చన అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తహసీల్దార్లు, కలెక్టరేట్ విభాగాల అధికారులు ఉన్నారు.

పురోభివృద్ధిలో ఏపీజీబీ



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

- ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు 2023వ సంవత్సరంలో పురోభివృద్ధిలో పయనించిందని ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని మరియాపురంలోగల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, పొట్టిశ్రీరాములు, నెల్లూరు, బాపట్ల, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 551 శాఖలు, 1182 బిజినెస్ కరస్పాండెంట్లు, 9 ప్రాంతీయ కార్యాలయాలను బ్యాంకు కలిగి ఉందన్నారు. 2023 డిసెంబరు నాటికి రూ. 20,648 కోట్ల డిపాజిట్లు, పోర్టుపోలియో మరియు రూ. 24159 కోట్ల అడ్వాన్సుల పోర్టుపోలియోతో కలిపి రూ. 44,808 కోట్ల వ్యాపారం కలిగి ఉందన్నారు. వ్యవసాయం, అనుబంధిత, ఎంఎస్ఎంఈ, విద్య, గృహ నిర్మాణం, వాహనం, బంగారు ఆభరణాలు మొదలైన ఉత్పత్తుల కింద రుణాల కోసం బ్యాంకు ఫైనాన్సింగ్ ఇస్తోందన్నారు. డీజీ ఖాతా, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్‌బ్యాంకింగ్, వాట్సాప్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్, ఏటీఎం వంటి డిజిటల్ సేవలను కూడా బ్యాంకు అందిస్తోందన్నారు. కార్డులు, మిస్డ్ కాల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏఈపీఎస్, ఎన్ఏసీహెచ్, ఈసీఎస్ ఆదేశాలు, మైక్రో ఏటీఎంలు, ఏటీఎం తదితర వాటి ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు.

డిపాజిట్లపై అన్ని ఇతర ప్రభుత్వం, ప్రైవేటు బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ రేటుతో పెరిగిన వడ్డీ రేట్లను ఆయన వివరించారు. బ్యాంకు ప్రత్యేక డిపాజిట్ ప్రొడెక్ట్ 'ప్రగతి కుబేర్-444'ను సాధారణ ప్రజలకు అత్యధిక వడ్డీ రేటు 7.50 శాతం, మహిళలకు అదనపు వడ్డీ రేటు 0.05 శాతం అందిస్తోందన్నారు. సీనియర్ సిటిజన్లకు 0.50-0.60 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 0.75 శాతం అదనపు వడ్డీ రేటు ఇవ్వనున్నామన్నారు. అలాగే మహిళా సూపర్ సీనియర్ సిటిజన్లకు కూడా అత్యధికంగా 8.30 శాతం అందిస్తున్నామన్నారు. ఖాతాదారులు ఈ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిపాజిట్లపై అందిస్తున్న ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎంలు జగదీశ్వర్‌రావు, పీఆర్ పడ్గేట్వార్, సంజీవప్ప, రంగప్ప బేగర్, పి.రాజేంద్రన్, ఆర్.గిరితోపాటు చీఫ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జాళ్లపాలెంలో పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.7 లక్షలు ఆస్తి నష్టం

వెలిగండ్ల: మండలంలోని జాళ్లపాలెం గ్రామానికి చెందిన దొడ్డా పెద్ద వెంకటసుబ్బారెడ్డి పొగాకు బ్యారన్ సోమవారం అగ్నికి ఆహుతైంది. క్యూరింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి బ్యారన్‌లోని పొగాకు పూర్తిగా కాలిపోయింది. స్థానికులు అందించిన సమాచారంతో కనిగిరి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అప్పటికే బ్యారన్ తగలబడింది. సుమారు రూ.7 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు దొడ్డా పెద వెంకటసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి

- సమస్యలను పీఎం నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తా..
- కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి పురుషోత్తం రూపాలా
- కె.పల్లెపాలెంలో మత్స్యకారులతో ముఖాముఖి
- కడలూరు సోనా బోట్లను కట్టడి చేస్తామని హామీ



మత్స్యకారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల

కె.పల్లెపాలెం(కొత్తపట్నం): మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసికెళ్లి పరిష్కరిస్తామని, జీవనోపాధి మెరుగుపర్చడానికి కృషి చేస్తామని కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా హామీ ఇచ్చారు. సాగర్ పరిక్రమలో భాగంగా సోమవారం రాత్రి కొత్తపట్నం మండలం కె.పల్లెపాలేనికి చేరుకున్న కేంద్ర మంత్రికి ఇక్కడి మత్స్యకారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక బంగారమ్మ ఆలయం ఆవరణలో మత్స్యకారులతో కేంద్ర మంత్రి ముఖాముఖి నిర్వహించారు. తొలుత మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి స్టాళ్లు, బోట్లు, వలలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి గల అవకాశాలను అంచనా వేసేందుకు తమిళనాడు, గోవా, మహారాష్ట్రలో పర్యటించి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినట్లు చెప్పారు. రైతుల మాదిరిగానే మత్స్యకారులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు డిల్లీలో కాకుండా మీ ముందు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని మత్స్యకారులను ఉద్దేశించి అన్నారు. అనంతరం నూతన సంవత్సర కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సబ్సిడీపై మంజూరు చేసిన బోటును మంత్రి ప్రారంభించడంతోపాటు పలువురికి కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేశారు.



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి

కడలూరు సోనాబోట్లు తీరంలో మత్స్య సంపద కొల్లకొడతున్నాయని మూడు జిల్లాల మత్స్యకార సంఘ అధ్యక్షుడు గోల్లపోతు నాగార్జున్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. చెన్నై, ఆంధ్రప్రదేశ్ అధికారులను కూర్చోబెట్టి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారుల్లో విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సముద్రంలో బోట్లు మునిగితే బీమా చెల్లించాలని, బోట్లు, వలలు, ఇంజన్‌కు వేర్వేరుగా సబ్సిడీ ఇవ్వాలని, కేసీసీ రుణాన్ని రూ.1.60 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాలని మత్స్యకారులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగానే కేంద్రం కూడా లీటర్ డీజిల్‌కు రూ.9 సబ్సిడీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బోట్లు, వలలు, ఇంజన్లపై 40 శాతం సబ్సిడీని 70 శాతానికి పెంచాలని, విపత్తుల సమయంలో కూడ భృతి కల్పించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. మంత్రి వెంట రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, ఏపీ మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, జాయింట్ సెక్రటరీ నీతూ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ సంజయ్ పాండే, జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్డీవో విశ్వేశ్వరరావు, రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ రాజధాని అమరావతి సమీపంలో తాడికొండ అడ్డరోడ్డు దగ్గర CRDA అనుమతి కలిగిన కొత్త వెంచర్‌లో ప్లాట్స్ కలవు. సంప్ర: 9949342563 [G-3109]

LAND FOR SALE

■ దర్శినియోజకవర్గంలోని కురిచేడు మండలంలో తారురోడ్డుకు ఆనుకొని పొలాలు : 1 ఎకరం 2 ఎకరాలు, 6 ఎకరాలు భూమి అమ్మబడును. ఎకరం ధర : 15 లక్షలు. సం॥ ✆ 98489 12561 (M.S.R) [O-192057]

Services

■ వ్యవసాయ భూములకు, రైతులకు, ఇంద స్త్రీలకు, వ్యాపారస్తులకు, పర్సనల్స్‌కు తక్కువ వడ్డీకి సహాయం చేయబడును. సంప్రదించండి: Ph : 7997441253 [H-788250]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824519]

Wanted

■ డ్రైవర్ కావలెను. చీరాలలోని హిమాలయ మార్చురి బాక్స్ సప్లయిర్స్ సంస్థ నందు పనిచేయుటకు డ్రైవర్ కావలెను. చీరాల లోకల్ వారికి మాత్రమే. సంప్ర॥ ✆ 92462 77100 [O-192039]

■ ఒంగోలులోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు ఆయమ్మలు, వార్డ్‌బాయ్స్, సెక్యూరిటీ గార్డ్స్ సె॥సూపర్ వైజర్స్ కా॥. ఆ॥జీతం + రూం. వసతి కలదు. ✆ 93814 54938, 99899 91543 [O-192038]

■ తెలుగు, DTP, ఇంగ్లీష్ & ఆన్‌లైన్ సర్వీసెస్ చేయగల కంప్యూటర్ ఆపరేటర్స్ M/F కావలెను. అనుభవం గలవారికి ప్రాధాన్యత. సం॥ శ్రీభాస్కర్ ఏజెన్సీస్ - ఒంగోలు ✆ 94913 78456 [O-192058]

■ నెల్లూరు, నారాయణ హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డ్స్ 50 మంది కావలెను. జీతం: 13000/-, రూం ఫ్రీ. శ్రీరాజరాజేశ్వరి సెక్యూరిటీ సర్వీసెస్, నెల్లూరు. సంప్ర: 80082 02789, 70325 59533. [NA-22992]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167576]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా యాడ్స్ పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 80193 41329. [M-1167581]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18k సంప్ర: 9160900024 / 9640400073. [HA-1035]

■ Authorized / Direct Company Looking Male / Female For Kandukuru Branch, Permanent Staff (A) Team Leaders, (B) Business Dev Mgrs, (C) Sales Mgrs, Salery: 25K to 35K, Interested Con Whatsapp/ Call : ✆ +91 94815 61331 [C-777452]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ :
ఒంగోలు
90102 02856
90102 02762